పతివ్రత

రైల్లో అంతా యోచనే లేదు. అలిసిపోయినాడు. టైఫాయిడ్ జరం. ఇంకా పూర్తిగా నయమై పత్యంకూడా తీసుకోలేదు. సుశీలరాసిన ఉత్తరం చదివాడు. తనకి సరిగా తెలీనుకూడా తెలీదు బయలుదేరుతున్నానని. దుర్గతో చెప్పనన్నాలేదు. తను రైల్లోంచి రాసిన ఉత్తరంతో తెలుసు కుంటుంది? కాని ఏం తెలుసు కుంటుంది? తనేం రాయగలిగాడు? తనకి మాత్రం ఏం స్పష్టం? ఇప్పటికైనా ఎట్లా తెలుసు తనకి ఎందుకు బైయలుదేరాడో! చెప్పినా ఎవరికర్థమౌతుంది! పరాయి మొగాడితో కాపరమున్న సుశీల దగ్గిరికి తను ఎందుకు బైలుదేరాడో!

అంతా అడివి. ఏవో "పాలెం", జేబులో ఉత్తరం. దాంటోవుంది చిరునామా? అది బండీ వాడికి చెప్పాడు. సాయంత్రానికి చేరుకుంటా మన్నాడు. రాత్రయింది, ఎంతకీ ఇదుగో అదుగో అంటాడు. ఆకలిగా కూడా వుంది. ఎప్పటికి? సుశీలనించి ఆ వుత్తరం వొచ్చిందాకా ఆమె బతికి వుందనేతెలీదు తనకి! ఎన్నేళ్లు? పదేళ్ళు? ఇప్పుడెట్లావుందో! మరి తను రావడం ఇష్టపడుతుందా? ఈ అడివిలో ఎవరో మొగవాడితో కాపరం వుండి వుంటుంది? అతను వొప్పుకుంటాడా? సుశీల వుంటుందిగా. ఫరవాలేదు. బొమ్మంటుందా? ఈ అడవిలో బొమ్మంటే తానేం కాను?

దుర్గని భరించలేకపోతే పోనీ, ఈ సుశీలదగ్గిరికి ఎందుకు? ఎందుకో ఎవరికి తెలుసు?

చుట్టూ చీకటి, ఎప్పటికీరాదా ఆవూరు? వూరుదాటాం అన్నాడు ఇందాక, మరి ఇంకా ఎంతదూరం? ఏవో జంతువులు అరుస్తున్నాయి, పెద్దపుల్లు కావుకదా!

అవును. దుర్గనించి రెండుసార్లు పారిపోయినాడు తను. కాని రెండుసార్లూ తీసుకొచ్చింది వెనక్కి, ఎందుకుతీసుకుపోనిచ్చాడు తనని! తనకి ఇష్టమే. తీసుకుపోవాలనే వుంది తనకీని. వొంటరిగా బతకలేడు. డబ్బుంటేనేం? తనవాళ్ళనే వాళ్లు లేకపోతే! పిల్లలూలేరు మరి! ఎందుకు పుట్టలేదో! అందుకనే ఈ సుశీల తప్ప గతి లేక, జరం బలహీనంలో వొళ్ళుతెలీక, ఆ వుత్తరం చూసి బైలుదేరాడు. వుత్తరంలో తనని రమ్మనిలేదే? ఎందుకు రమ్మంటుంది? తనెందుకు సుశీలకి? ఇప్పుడు? ఎప్పుడుమాత్రం తనెందుకు సుశీలకి? కాని ఏం ప్రేమగా వుండేది? ఎంత సేవచేసేది? దుర్గ కనక తనని అట్లా ఉపేక్షచేసిందిగాని సుశీల ఐతేనా! అన్నిరోజులూ తనపక్కన కూచోదా రాత్రింబగలు! వుండనీ ప్రియుడు వుంటేనేంగాక. తనని వొక్క నిమషం వొదిలేదా? తన తరవాతనే ఏ ప్రియుడైనా? తన నడుంపోటు రోజుల్లో దూలానికి తాళ్ళు కట్టుకుని నడుం తొక్కేది రాత్రంతా. అలిసి పడిపోకండా తాళ్ళు పట్టుకుని. ఆ రుణం ఎన్నడన్నా తీర్చుకోగలడా? తెల్లారకట్ట తను నిద్రపోయేప్పుడు, తోటలో జూకా పొదకింద ఆ కంసాలి అతనితో పడుకునేదిట. అన్నారు అట్లా. నిజమో కాదో! సుశీలే నిజమని అందిగా! నిజమైతేనేం? ఎప్పుడూ తను సుశీలని తలుచుకుంటాడనీ, ఆమె ఫోటోని ఎదురుగా పెట్టుకున్నాడనేగా ముఖ్యమైన కోపం దుర్గకి. దుర్గకి గర్వం. పాతివ్రత్య గర్వం, సుశీలని తప్పుడుమాట లంటుంది. డబ్బుగర్వం. గొప్పఇంటి బిడ్డనని గర్వం. తనకోసం చేసిన త్యాగాలు చెప్పుకుచెప్పుకు గర్వం. ఎన్నడన్నా సుశీల ఒక్కనాడు అందా తనుచేసిన సేవసంగతి! తను ఆమెని వెళ్ళకొట్టిన రోజున అన్నా? ఎంత బుద్ధిహీనుడు తను! సుశీలని వెళ్ళకొట్టిన దౌర్భాగ్యుడు! ఆమె ఇంటికే వెడుతున్నాడు మళ్ళీ! మరి ప్రజలగోల పడలేక పొమ్మన్నాడు సుశీలని. చాలా ఏడ్చింది పాపం! ఆమెకోసం కాదేమో, ఆ విచారమంతా తన కోసమేనేమో!

బండీ ఆగుతోంది. ఎందుకు? అడగడానికి నోటమాటరాదు. నీరసం, ఈ అడవిలో ఆగిపోతుందా? తోవతప్పిపోయినారా? మాటలు.

ఎవరు? అంటున్నారు? దీపం కూడాను. ఎవరు? ఆకలి! గుండెదడ! ఎవరు? ఏమిటా మాటలు?

చీకటి-చీకటి?

* * *

కలా! నిజమా? ఎక్కడవున్నాడు తను? ఎవరిది? సుశీల! సుశీల ఎట్లావొచ్చింది? చచ్చిపోయింది గావును. తన పక్కనకూచుంది.

"సుశీలా," కాని గొంతులోంచి చప్పుడు వినపట్టంలేదు. చచ్చిపోయి నాడు నిజంగానే! సుశీల చచ్చిపోయి ఎంత అందంగా వుందో! ఈ లోకంలో మాటలు వుండవుగావును! తన బాధ అంతా ఏమయింది? దేహం వుంటుందా? తనకి వొళ్ళూ చేతులూ కనపడుతున్నాయి.

"సుశీలా!"

పలకదేం? తను పిలవందే! మాట వినపడందే! స్వర్గమా ఇది? నరకమా? ఈ పెద్ద అడివి? పిట్టల అడావిడి. పువ్వులు చిన్న ఎండగడ్డిలో. తమాషా అందాల నీడలు పచ్చగడ్డిమీద, ఏంలోకం ఇది! ఇక్కడ ఏం చేస్తారు? కాని తను అడివిలోకి బైలుదేరాడు కాదూ? సుశీలకోసం? చెట్ల మధ్య ఎవరో కదులుతున్నారు. బుజాల గొడ్డళ్ళతో. ఇక్కడా గొడ్డళ్ళు వుంటాయిగావును? ఏదో అంటోంది సుశీల. తనకి వినపడదు....

ఏదో పోస్తోంది తన నోట్లో: బావుంది. జావా! భూలోకం మల్లేనే వుందే ఈ లోకం! తనచావువిని దుర్గ ఏమంటుందో! చాలా ఏడుస్తుంది గావును?

నిద్ర, నిద్ర మళ్ళీ.

మళ్ళీ కళ్ళుతెరిచేప్పటికి — తన పక్కన సుశీల. ఇంకా పిట్టలు ఈలలు వేస్తున్నాయి. ఏదో వుడుకుతున్నవాసన — సుశీల తన పక్కన చెయ్యిజాచాడు. దయగా తన చెయ్యిపట్టుకుంది. మాట్లాడుతోంది...

"నెమ్మదిగా వుందా?"

"సు—శీ—లా...."

"పడుకోండి. మాట్లాడకండి."

"వెళ్ళి....పో....కూ?"

"వెళ్ళను, పడుకోండి."

"చెయ్యి ఇట్లా తే."

చెయ్యీ చెయ్యీ కలిపి అతనూ సుశీలా అట్లా ఎగిరిపోయినారు. చీకటయింది. చెట్లనిండా మిణుగురు పురుగులు, ఆ కాంతుల్లోంచి ఎగురుతూ చెట్టుచివర కూచుని కిందికిచూస్తున్నారు. ఆకుల్లోంచి ఆకుకి నీలం వెలుతురు గీతలుగీస్తో మిణుగురు పురుగులు ఎగురుతున్నాయి. పైన నల్లని ఆకాశంనిండా మెరిసే చుక్కలు. కింద వెలుతురుజరీ మెరుపులచెట్టు ఏమిటి ఇంత అందం? ఎదురుగా గడ్డగూడుగావును. ముక్కులు ముందుకు చాచుకుని పడుకున్నాయి మూడు పిల్లలు. వాటిని ఆవరించుకుని తల్లి గుడ్లిప్పిచూస్తో పక్కనే కొమ్మమీద హాయిగా తండ్రి. మిణుగురు పురుగులు ఆ పిల్లల ముక్కులమీద ఆడుకుంటున్నాయి. మెత్తని చిన్నపూగులో వాటి వీపుమీదనించి జారుతున్నాయి. "చూడు, చూడు" అంది తనచేతిని లాగుతో సుశీల.

అప్పుడే తెరుచుకుంటున్న ప్రతి పువ్వులోంచీ, చిన్న చిన్న కిన్నెరలు ఆశ్చర్యంగా, బైటికి వొచ్చి పువ్వురేకులమీద నుంచుని చూస్తున్నారు, పెద్దగా కళ్ళువిప్పి, మెరిసే రంగుల బట్టలు, నీలం, ఆకుపచ్చ, గులాబి, నారింజ, పసుపుపచ్చ, ఊదా, ఎన్నిరంగులు ఆ బట్టలు; బట్టల్లోంచే అందమైనవొళ్ళు మెరుస్తోంది. ఒకర్నివొకరుదూరంనించిచూస్తో నవ్వుతున్నారు. చెట్టుతొర్రల్లోంచి ఏవేవో వాయిద్యాలతో బైలుదేరారు పెద్దపెద్ద మీసాల గడ్డాల నవ్వుతెప్పించే మొహాల వాయిద్యంవాళ్లు. ఏదో ఎన్నడూవినని సంగీతం నృత్యం చేసుకుంటో, మిణుగురు గీతల మీద కొమ్మమీద నించి

జారుతో, ఒకరునొకరుకావిలించుకుంటో, వొదులుతో, బుజాలమీద చేతులు వేసుకుని వూగుతో పెద్ద కోలాహలం, ఆనందం, వడివడిగా రంగుల్లో రంగులు కలుస్తో విడిపడుతో.

"మనమూ వెడదామా, వాళ్ళల్లోకి?" అందీ సుశీల.

సుశీల వంక చూశాడు. ఆమెకూడా కిన్నెరా? నవ్వుతోంది కళ్ళలోంచి.

"చూద్దాం ఏంలోకం అది?"

"ఏ లోకం? మన లోకమే. అసలు మనలోకం ఇదీ. అక్కడంతా అదో కల."

చంద్రుడు ఉదయిస్తున్నాడు. చెట్టులో కిన్నెరలందరూ ఎగిరిపోతు న్నారు. "లాపోదాం." సునాయానంగా ఎగిరారు ఇద్దరూ. ఆ అడవిమీద నించి కిందరాత్రి. మృగాలు, పాములు, పిల్లులు, గోదురు కప్పలు, సివంగులు....చాలా కొద్దినిమషాల్లోనో, గంటల్లోనో—ఎగిరే గుడ్లగూబల, గబ్బిలాల మధ్యనించి వెడుతున్నారు. రాత్రిలో ఒకరినొకరు పిలుచుకుంటో, గాలి మధ్యలోనే అల్లర్లు చేసుకుంటో, సరసాలాడుకుంటో, ఎంతోమందీ ఒక్క నిమషం మెరుస్తో మాయమౌతో....

సముద్రం. ఇసికమీద కొత్తప్రియుడి వేళ్ళమల్లే సందేహిస్తో పడు తోంది వెన్నెల, ఎదురుగా ఎర్రని చంద్రబింబపు రేఖ నేటి నీలంలోంచి లేచింది గంభీరంగా, గొప్ప అధికారంతో. ఒక కొన సముద్రంలో ఇంకో కొన ఆకాశంలో, ఇసికనిండా కిన్నెరకన్యలు, యువకులు, గంతులేస్తో, అల్లరిచేస్తో, దొల్లుతో, నవ్వుతో, దూకుతున్నారు అలలమీద. అలలతో పైకిలేచి, చేతులు చేతులు కలిపి, అద్దంమల్లే మెరిసే నీటిమీదనించి జారుతున్నారు. అలల అడుగునపడి లేచి, అలల నురుగులో పైకి ఎగిరి, పడుతున్నారు. ఎంత ఆనందం? తానూ సుశీలా దూకారు సము ద్రంలో, నీరు తడపదు. వుత్తకాంతిలో తేలుతున్నట్టుగా వుంది. అలల

మీద బంగారుచారల్లో కావిలించుకుని దొర్లారు తానూ సుశీలా. ఎంత అందంగా కనపడ్డా, ఏ కిన్నెరా, తన సుశీలను పోలిలేదు. ఎంత నవ్వు ఆమె కళ్ళల్లో! ఎంతకాలమైనా ఇట్లాగే ఆడుకోవొచ్చా! ఆకలీ రోగమూ వుండవా? తెల్లవారదా? ఇంక పగలూ, ధ్యాసలూ, పనులూ వుండవా?

చంద్రరేఖ పైకి లేచింది. కాంతి తెల్లనయ్యింది. ఎగిరిపోతున్నారు అందరూ.

"పోదామా, మనమూ? తెల్లారుతోంది" అంది సుశీల.

"తెల్లారుతోందా?" అని తను భయంగా.

"తెల్లారితేనేం?" అని ఆమె ధీరంగా.

అట్లా ఆ ప్రియులతో కలిసి పోతున్నారు. మధ్యలో ఆకాశంలో కొంగలబారులమల్లే, వెడుతో కొత్త గుంపులు, కొత్తసంగీతాలు, కంఠాలు, నవ్వులు, కొత్తరంగులు, అందాలు.

తానూ సుశీలా చాలాపైకి ఎగురుతున్నారు. చుట్టూ ఏవో కంఠాలూ, గానాలు.

తూర్పున ఎర్రనిచార, ఆ మెత్తని కాంతిని మెల్లిగా పడమట ఓ మబ్బు లాక్కుని ఆపింది. గుంపులు గుంపులుగా కూచుని ఒకరిమీద ఒక రానుకుని, ముద్దులుపెట్టుకుంటో, కళ్ళలోకి నవ్వుకుంటో కూచున్నారు. భూమిమీదికి కనపడేవేపుకన్న ఆకాశంవేపున అమితమైన శుభ్ర తేజస్సుతో మెరుస్తున్నాయి మబ్బులు. క్షణక్షణమూ కాంతులు మారుతో, ఆ కాంతిలో లేచి ఎగిరిపోతున్నారు ఎక్కడికో చాలామంది, సుశీలవేపూ అతనివేపూ చేతులువూపుతో. చిన్న ఎండ వొచ్చింది. దూరంగా కొండచివరలా, తరువాత చెట్లమీదా, మైదానాల్లో నదులమీదాపడి ప్రకాశిస్తోంది తెల్లని ఎండ.

"మనమూ వెళ్ళిపోదాం రా" అంది సుశీల.

ఆమె బుజంచుట్టూ చెయ్యేసి వొచ్చేశాడు.

కళ్లు తెరిచేప్పటికి అడవిలో పందిరికింద పక్కమీద ఆమె బుజం చుట్టూ చెయ్యేసి కూచుని వున్నాడు. వాళ్ళ పాదాలముందు ఎండచార పడుతోంది. పిట్టలు ఆడుకుంటున్నాయి చెట్లల్లో. గోరింకలజత ఎదురుగా నేలమీద కూచుని చూస్తోంది. గోరింటపూల పరిమళం అల్లుకుంది అడివిలోంచి వాళ్ళచుట్టూ. కాని సుశీల అట్లా వుందేం? తన తల ఇంకా నీరసంగా బరువుగా వుంది కళ్లు తిరుగుతున్నాయి. రాత్రిలాగులేదు సుశీల. వృత్తమనిషి. నిద్రలేని కళ్ళతో, చెదిరిన జుట్టుతో, నలిగిన చీరెతో, ఆదుర్దాగా అతనివంక చూస్తోంది. మాట్లాడదా మనుకున్నాడు గాని నీరసం.

ఏదో ఇచ్చింది తాగడానికి, తరవాత మళ్ళీ నిద్రో మగతో. మళ్ళీ మెళకువ వొచ్చేటప్పటికి సూర్యుడు పందిరిపైకి వెళ్ళిపోయినాడు. చెట్లల్లోంచి వొచ్చే ఎండ ఆకుపచ్చగావుంది. ఆ వేడి రక్తంలోకివెళ్ళి ఓదారుస్తోంది. గాలిలో ఏవేవో నిర్మలమైన పరిమళాలు కొయ్యా, ఆకులూ నానిన వాసన వాటితో కలిసి. కొత్త కొయ్యల శుభ్రత. చెట్టును కొడుతున్న చప్పుడు, మనుషులో పిట్టలో. తన పక్కన సుశీల కూచుని వుంది. ఆమె ప్రియుడు కనపడడేం? ప్రశ్నలువేసే వోపికలేదు. ఆమె నించి మాటలూ ఖరించలేడు.

దుర్గ ఏం చేస్తోవుంటుందో! తనకోసం పత్రికల్లో ప్రకటన వేయించదుకద! ఇంతదూరం వస్తాయా పత్రికలు! తనని, వెతికి పట్టుకుని తీసుకునిపోదుకద! తను వెళ్లనన్నా లాక్కు పోతారా? ఎంత పొరపాటు చేశాడు తను! సుశీల వెళ్ళిపోయింతరవాత వ్యవహారం మీద మద్రాసు వెళ్లాడు. తనని హోటలుకి వెతుక్కునివచ్చి ఇంటికి తీసుకుపోయినాడు చెంచుకిష్టయ్య. తనకి భార్య లేదుకదా, తను ఆస్తినంతా ఏం చేసుకుంటాడు? బంధువులందరికీ, దూరంబంధువులకికూడా అతనిమీద చాలా ప్రేమకలిగింది. ఆ చెంచుకిష్టయ్యకి ఎన్నేళ్ళకీ ప్రాక్టీసు రాలేదు హైకోర్టులో. పైగా తాను అతన్ని వొకీలుగా పెట్టుకో లేదని కోపంగూడాను? తనకి మొహమాటం. ఎవరన్నా గట్టిగాపిలిస్తే

వెళ్ళకుండా వుండలేదు. కొందరికి చాతనౌను. కాని పైకి తాను తన మెత్తదనాన్ని కనపరచదు గావును. గట్టిగా డబ్బుయిమ్మంటే, ఇవ్వను పొమ్మనే శక్తిలేదని తన సంగతి ఎవరికీ తెలీదు. తానే గట్టివాడైతే సుశీల ఆటలు ఆ విధంగా సాగేవా? కాని గట్టివాళ్ల సంసారాలు మాత్రం ఏమాత్రం శోభిల్లుతున్నాయి? తన మెత్తదనం వల్లనే, సుశీల ఇప్పుడు తన పక్కన కూచునివుంది ఈ నిమిషం.

చెంచుకిష్టయ్య కూతురు దుర్గ, మరి మొదటినించీ ఎత్తువేశారేమో! తనని చాలా ఆదరంగా చూశారు, బి.ఏ. చదువుతున్న దుర్గ పుస్తకాల్ని నిర్లక్ష్యంచేసి తన సేవకి నిమగ్నురాలయింది. తనకి పాఠాలు చెప్పమంది. ఆమెకోసం మరిచిపోయిన కెమిస్ట్రీనంతా తిరగవేసుకున్నాడు. ఆమెకి రాకనా? అదంతా ఒక స్కీంలాగు కనపడుతోంది ఇప్పుడు, మద్రాసులో తనపని తీరినా, సుశీలలేని ఇంటికి వెళ్ళడానికి బుద్ధిపుట్టకో. మరి దుర్గ స్నేహమో! తిరిగి వెళ్ళిపోలేదు ఇంటికి. సుశీలని చాలా త్వరలో మరిచిపోయినాడు. ఎంతసేపటికీ తనకి దుర్గకూతురే కనిపించింది. తనూ చిన్నవాణ్ణేనని గుర్తేలేదు. సుశీలతో తాను పడ్డ క్షోభతో తనకి ఎన్నో ఏళ్లు వొచ్చినట్టు అనిపించింది గావును?

"ఎక్కడికి వెళ్ళరేం?"

"ఎక్కడికి వెళ్ళను?"

"అదేమిటి? బీచి, పార్కు, ఒక ఎగ్జిబిషన్ కూడా వుంది. సినీమాలు.... "

"ఏమిటో పాతమద్రాసు. అవన్నీ మీకు, చిన్నవాళ్ళకి."

"మీరేం మహాపెద్దవారా?"

"నువ్వు వెళ్ళవేం?"

"వొంటరిగానా? నాన్న, అమ్మా రారు."

"మరి నీకు స్నేహితులు లేరా?"

"వున్నారుగాని, సరదా వుండదు. అదిగాక మీరున్నారు."

"నాకోసం వుంటున్నావా? పోనీ నన్నూ రమ్మంటావా?"

"నా బలవంతాన వొద్దు."

ఎప్పుడూ ఆడవాళ్ళతో తిరగలేదుఅతను. దుర్గ డ్రస్ చేసుకుని వొస్తే- ఈమెతో నేనా? అనిపించింది. చాలా అందం దుర్గ. కళ్ళు చెవులని అందుకోవాలని చూస్తాయి. నిదానంగా వున్నా చూపులు ఏమిటో చెపు తున్నట్లు వుంటాయి. కొత్త యవ్వనం, శరీరకాంతిలో, పెదిమల మీది ఉత్సాహంలో, నడకలో.

తరవాత రోజూ వెడుతున్నారు. ఇతర్లకు కొనిపెట్టడంలో సరదా అప్పుడు తెలిసింది తనకి. కొననీదు. తన సంతోషం ఆమెకేం తెలుసు? తనకే ఓ. కూతురుండి, ఎదిగి చదువుకుంటో వుంటే. ఇట్లా మద్రాసు చూపించి ఎన్ని కొనిపెట్టేవాడో! సుశీలకా? సుశీలకి అందమైన వొస్తువుల మీద దృష్టి ఏదీ? మళ్ళీ అందం తెలుసు. పంచమినాటి చంద్రుడు గోడమీద పడుతుంటే అట్లా చూస్తో నుంచునేది. చలికాలంలో సూర్యకాంత, ఇంటి ముందు తాడిచెట్టు చుట్టూ పూస్తే ఏదో ఆవేశంతో ఆ పూలని తాకుతో నుంచునేది, కాని తనకేం అక్కర్లేదు. ఓ పువ్వునన్నా కోసేది కాదు.

నెలరోజులయింది. తను వెళ్ళిపోవాలన్నాడు ఇంటికి.

"వెళ్ళిపోతారా? ఎందుకు వెళ్ళడం?" అంది కళ్ళలో నీళ్ళతో దుర్గ.

"వెళ్ళక ఎన్నా   రా, మా పూరు.'

"ఇప్పుడే వొస్తా."

"చదువూ?"

"అవును. మీరు వెళ్ళిపోతే ఇంకేం తోచదు."

వుండాలనే అనిపించింది ఆమె విచారం చూడలేక.

ఈనాడు అదంతా నిజమా నటనా, అని సందేహం.

ఆ రాత్రి ఇంగ్లీషు సినీమాకి వెళ్ళారు. వాళ్ళొచ్చిన హెరాల్డు కాయితం తనపక్కమీద పడేశిందిగావును?

పడుకోబోతున్నాడు. గదికిందనించి రేరాణి పరిమళం, లైటు ఆర్పితే మాఘచంద్రుడు గదినిండా, పొగకన్నా దట్టంగా. ఇంట్లో ఇంకా మాట్లాడుతూనే వున్నారు పిల్లలూ, పెద్దలూ. దుర్గ పరిగెత్తుకుంటో వొచ్చింది.

"హెరాల్డు ఇక్కడ పడేశానా? తమ్ముడు చూస్తానంటున్నాడు." పక్కమీదనుంచి తీసుకుంది.

"ఇదేనా" అని చూడ్డానికి తన పక్కకి కిటికీ దగ్గరకి వొచ్చింది. చూసింది. తనూ చూశాడు.

స్పెన్సర్ ట్రేసీ లోరటాయంగ్‌ని కావలించుకుని ముద్దుపెట్టుకుంటున్నాడు హెరాల్డులో. చిన్నగా నవ్వి తనవంక చూసింది. ఏమయిందో ఆ నిమిషాన? ఏం కాలేదు. తనేం చెయ్యనేలేదు, కాని ఏదో జరిగింది. ఆమె కదలలేదు. కాయితం వంకనే చూస్తోంది. లోపల్నించి ఆమెలో నించి ఆమె రొమ్ము ఆపిన విశ్వాసంతో బరువెక్కింది వెన్నెల్లో. వూపిరి చాలాసేపు ఆపినట్టు ఒక్క మాటుగా ఉక్కిరిబిక్కిరయ్యింది.

"ఏమిటి? ఏమిటి?"

ఆపుకోలేని దుఃఖం, మొహాన్ని తన భుజానికానించి, ఒకచేత్తో ఆమె ముఖాన్ని ఎత్తి, భుజంనించి రెండో చేత్తో కన్నీళ్ళు తుడిచాడు.

ఇంకా అర్థం కాలేదు. అట్లాంటివెన్నడూ ఎరగడు, సినీమాలో ఆ దేశంవాళ్ళు ఏం చేసినా, వాళ్ళగోల అది, తననేం కదిలించదు.

"ఏమిటీ? ఏమిటి?" అన్నాడు మళ్ళీ.

"ఇందాక....వాళ్ళు....ఇట్లానే...."

అని తనని అనుకుని ఏడ్చింది.

తనకీ, ఆమెకీ సరిపోయినంత విద్యుచ్ఛక్తి ఆమెలో ఆ రాత్రి, తన రక్తానికి వేడినిచ్చింది, ఆ వెన్నెలలో, సుశీలలో, నలిగిచచ్చిన తన యవ్వనం.

దగ్గిరికి లాక్కుంటే అందుకోసమే చూస్తున్నట్టు తనలోపలికి తన మీదికి జారిపోయింది. తన షర్టులోంచి ఆమె బ్లౌజులోంచి ఆమె ఉద్రేకం. తన మెడవెనక కలుసుకున్న ఆమె వేళ్ళ అలజడి. తనవేపు వెతుకుతున్న గుడ్డిగా వెతుకుతున్న ఆమె పెదిమలు.

ఇంక వొళ్ళు తెలీలేదు.

ఆమెని పట్టుకునే తలుపు దగ్గిరగా జరిగాడు.

ఒక చెయ్యి విడిపించుకుని తెరిచివున్న రెక్క మూస్తున్నాడు.

చప్పున తప్పించుకొని వెళ్ళిపోయింది. తన వెనక తలలోని మొల్లల పరిమళాల్ని వొదిలి. అప్పటికీ పెళ్ళి వుద్దేశ్యం రానేలేదు. తనకి, ఆ రాత్రంతా "న్యాయమా, సీతా?" అనే ఆఘోరించాడు తాను. ఇంక వెళ్ళతీరాలి. పెళ్ళిగాని పిల్లతో చాలా అధర్మం. దుర్గ అట్లా చేసిందని కోపంలేదు. తనమీద ఇష్టమూ అనుకోలేదు. నవ యవ్వనంలో వుంది. పెళ్ళికాలేదు. ఆ సినీమా చూసి కదిలిపోయింది ఆ వెన్నెలరాత్రి. పెళ్ళి చెయ్యకుండా పిల్లల్ని ఎదిగిస్తే ఇదే ఖర్మం. మర్నాడు తన దగ్గిరికి రాదను కున్నాడు. కానీ కాఫీ తీసుకుని వొచ్చి తలవొంచుకుని నుంచుంది.

"నువ్వూ తెచ్చుకోలేదేం?"

"తెచ్చుకోనా? మీకు కోపం వొచ్చిందనుకున్నాను. రాలేదా?" అని అతని తలని తాకి వెళ్ళిపోయింది ఒక్క గంతులో! ఎంత ఉత్సాహం ఆమెలో!

తన కాఫీ తెచ్చుకుంటో తలుపు దగ్గిరిగా వేసి వొచ్చింది. ఒక్క నిమిషం ఆమెని తన వొళ్లో కూచోపెట్టుకున్నాడు. ఇద్దరూ ఒక కప్పు లోంచే తాగారు. తన వొళ్ళోకి దుర్గని తీసుకోనూలేదు. ఆమె తన వొళ్ళోకి రానూలేదు. ఆమె వొళ్లు తనకి తగిలిన చోటనల్లా ఏదో భూమికి సంబం ధించని అనందానుభూతి కలిగింది. ఎందుకు అంత తొందరలో మాయం కావాలి ఆ అనుభవం! ఎట్లా మాయమవుతుంది? ఎందుకు? మనుష్యులకు అంతమాత్రమే కటాక్షించాడు గావును ఈశ్వరుడు.

"ఎవరన్నా వొస్తారేమో!"

"రారు."

"వొస్తే?"

"రానీండి. తప్పేముంది?"

ఆనాడు ఇదంతా ముందే అందరూ యోచించుకున్నదేమో నన్న అనుమానం రాలేదు. ఈనాడూ నమ్మలేదు. కాదు; నిజంగానే ప్రేమించింది తనని. మరి అట్లా మారిందేం? అంతే మనుషులు.

ఆమెకోసం తను చూడడం. నిమిషానికోసారి నవ్వుతో, దూకుతో వొచ్చి తన వెనక నించి మెడని కావిలించుకుని, తను తిరిగేలోపల పారి పోవడం.

మళ్ళీ రాత్రి ఆ సినిమాకే తీసికెళ్ళింది. వెనకగా కూచున్నారు. మళ్లీ ప్రేమ ముద్దు పెట్టుకునే సమయాన తన దగ్గిరిగా అనుకుంది పక్క కుర్చీ లోంచి....లోరెటాని ముద్దు పెట్టుకోడం తను చూడనేలేదు.

వారం రోజులయింది. తప్పు. తప్పు తాను వెళ్ళిపోవాలి అనుకుం టోనే వున్నాడు. కాని ఆమెతో చెపితే. ఆమె పెదిమలమీది దైన్యం చూడలేడు. ఆరాత్రి—అప్పుడే కృష్ణపక్షం తొమ్మిదింటికి పున్నాగచెట్ల వెనకనించి లేచే పసుపుపచ్చ చంద్రబింబాన్ని చూస్తో, కాళిదాసు శ్లోకం చదువుకుంటున్నాడు.

తన లోపలిబాధ ఎక్కువగా వుంది. ఆడవాళ్ళు సహించగలరేమో! పోనీ కన్యలకి ఇబ్బంది లేదేమో! దాహంకొన్నవాడికి ఒక్కొక్క చుక్క నీటితో పెదవుల్ని తడుపుతున్నట్లుగా వుంది తన బతుకు.

ఎప్పుడు వొచ్చి నుంచుందో చప్పుడుగాకుండా తన వెనక. నిట్టూర్పుతో అతను వెనక్కి తిరిగేప్పటికి ఆమె రొమ్ము అతని చేతికి రాచుకుంది. చేతిని అట్లానే వుంచి ఆమెవంక తిరిగాడు. ఆమె వొం

టోంచి బైలుదేరిన గగుర్పు ఆమె స్తనం చివరినించి తన గుండెలోకి పొడి చింది. చేత్తో వెతికాడు.

ఆమె తప్పించుకుంది. తలుపు దగ్గిర ఆమెని పట్టుకుని వెనక్కి లాగాడు.

"ఇప్పుడు కాదు,"

"వీల్లేదు."

"నా మాట నమ్ము. ఇప్పుడుకాదు."

అని వెళ్ళిపోయింది. వెనక్కి తిరిగి దయగా నవ్వి.

నిరాశ పొందిన నరాలతో, తోచక అటూ ఇటూ కొట్టుకుని నిద్ర పోయినాడు. కాని ఎంత మధురమైన కాలం! అట్లాంటి బాధైన దొరకదు ఎంత కొట్టుకున్నా. ఆ అదృష్టం తొలిగిపోయింతరవాత.

నిద్రలో పెదిమలమీద ముద్దులు. తన మీద అనుకున్న బరువు. వెన్నెట్లో తెల్లనిచీరె. నార్సిసస్ పరిమళం మెడకిందనించి. మెల్లిగా తాను ఆమె పొట్టమీదనించి వేళ్ళని....

తలుచుకుని ఈనాడు ఏమైనాడో, సుశీల "ఏమిటి? ఏమిటి?" అంటోంది ఆదుర్దాగా! మళ్ళీ నిద్ర. చల్లగాలిలో, చెట్లనీడల్లో, రంపపు కోత రాగంలో—నిద్ర.

జబ్బుపడి లేచింతరవాత ఎంత అందంగా వుంటుంది లోకం. దేహమో, మనసో, తన పాతపొరల్ని, విషాల్ని, మామూలుతనాల్ని వొది లించుకుని కొత్తగా సహజంగా అనుభవిస్తుంది గావును! మనుషులమీద ఎంత ప్రేమ—బతికివున్నానని ఎంత సంతుష్టి!

ఆ జబ్బుతో చచ్చిపోయి, ఈ దేహభారంనించే బైటపడితే, ఇంకా కొన్నివేల రెట్ల అందంతోనో కనపడకూడదా ఈ పాత లోకం! తన కల జ్ఞాపకం వొచ్చింది! చాలా నిజంగా కనపడ్డది కల, సుశీలకి, తెలుసునా?

మాట్లాడబోయినా, రెండురోజులు మాట్లాడనీలేదు సుశీల. రాత్రంతా తన వొళ్ళు పడుతో తన నిద్రని చూస్తో కూచుంది. ఆమె అనిపించింది అతనికి—కూచుంటుందని తెలుసు. పూర్వమూ అంతే. అట్లాంటి సేవ ఆమెలో, తను తన్నినప్పుడు, వెముకలు విరక్కొట్టినప్పుడుకూడా, తనకేం బాధ కలిగినా, పొక్కుంటో వొచ్చేది పక్కదగ్గిరికి.

"ఎందుకు వొచ్చారు?" అంది మధ్యాన్నం. అదే మొదటి ప్రశ్న. ఎదురుగా రెండు కొయ్యరంగు చారల పిట్టలు కూచున్నాయి వాళ్ళవంక చూస్తో. చెట్లనీడలో హాయిగా! విశ్రాంతిగా? ఎండ కింద మెరుస్తో చెట్ల ఆకుల్లో చీకటి గుబుర్లు గాలికి వూగుతో.

"ఇబ్బందా?" అన్నాడు తను.

"ఏం ఇబ్బంది"

"అతను?"

"అతనా? ఏంలేదు."

"వుండనా!"

"తప్పకుండా."

ఊరుకుంది అటు తరువాత. మళ్ళీ అడుగుతుంది "ఎందుకు వొచ్చా" రని. ఎందుకు వొచ్చాడు? ఏం చెపుతాడు? చెప్పడానికేం వుంది? తన యాతన నిజంగా వుందా? ఇప్పుడు ఆలోచిస్తే ఊహించుకున్నానేమో అని అనుమానంగా వుంది. ఏం చేసింది దుర్గ? ఎందుకంత దుర్భరమయింది బతుకు? పెద్ద తప్పు తను సుశీలని మరిచి పోలేక పోవడమే. ఎందుకు మరిచి పోలేక పోయినాడు? అందంలో, యవ్వనంలో, విద్యలో, జ్ఞానంలో, ధనంలో అన్నివిధాలా అధికురాలు దుర్గ సుశీలకన్న.

సుశీల తనవంక చూస్తోంది. కళ్ళు మూసుకుని నిద్ర నటించి. యీ చిక్కు విడతీసుకోవాలి, లేకపోతే ఏం జవాబు చెపుతాడు శుశీలకి,

సుశీల అట్లా కదలకుండా అడివికేసి చూస్తో కూచుంది. సుశీల ఎప్పుడూ అంతే వూరికే కిటికిలోంచో, నేలకేసో, చూస్తోనో, ఏమీ చూడకుండానో అట్లా కూచునేది. దుర్గ ఎంత భేదం? ఏదో ఒకటి చెయ్యకుండా మాట్లాడ కుండా, తిట్టకుండా వుండలేదు. సుశీల అంతే. ఏదన్నా అవసరం కలిగితే తప్ప కదలదు. మాట్లాడదు. ఏ ప్రియుడికోసమో కలకంటోంది అనుకుని ద్వేషపడేవాడతను.

ఏమిటి దుర్గలో పడని సంగతి తనకి? ఆమె గర్వం, మళ్ళీ తన మీద కాదు గర్వం, కాని ఆమెలోనే గర్వం. ఎవరిమీదా కాదు. మళ్ళీ మర్యాద, వినయం అన్నీ వున్నాయి. కానీ గర్వం, గడ్డకట్టిన గర్వం— తనని దేనికీ ఇచ్చుకోలేని గర్వం. మనసు లోపలి కారణంలేని గర్వం. గొప్పే అది, కాని సరిపడలేదు, తనకి.

ఎందుకాగర్వం అనియోచిస్తే ఆమె పాతివ్రత్యంవల్ల ననిపించింది. పూర్వం పతివ్రతలు సమస్తమూ లోపల్నించి అర్పించేసుకునేవాళ్ళు తమకి వేరే వ్యక్తిత్వంలేకుండా, వాళ్ళకి తాము పతివ్రతలమని తెలీనేతెలీదేమో; నాటకాల్లో పద్యాలలో "నేనే పతివ్రతనైతే" అని పాడిస్తారుగాని! తాను ఓ పాతివ్రత్యం చేస్తున్నానని చేస్తే ఏ మాత్రం చెయ్యగలదు! ధర్మపరుణ్ణి అనుకుంటో, జాలిలేకుండా చేసే దానాలమల్లేనా వుంటుంది ఆ పాతివ్రత్యం. ఏమైనా ఈనాడు మాత్రం, పాతివ్రత్యం, స్త్రీలలో ఒక గర్వకారణ మయింది; దుర్గణమైంది. అపురూపం కావడంవల్లనేమో, సుశీల నిరంతర వ్యభిచార గుణందని తెలిసికూడా తానింకా ఆ సుశీలనితలుచుకోడం భరించి వుండదు. అదే తనమీద కోపం, కాని తనకెందుకులేచిపోయిన ఈ సుశీల మీద? లేచిపోయిందా? లేచిపోలేదు. తను వెళ్ళకొట్టిందాకా వెళ్ళనేలేదు. తను ఎంత హింసించినా? అప్పుడు కూడా ఏడ్చింది తానేమైపోతాడోనని. మరి సుశీలమీద ఎందుకు తనకంత జ్ఞాపకం! ఏమో; అదే తెముల్చు కోవాలి ఇప్పుడు. కాని దుర్గ గర్వం తన నెందుకు బాధించింది? ఆ ఇచ్చు కోలేనితనాన్ని భరించలేదేమో పురుషుడు. అంతే ఆ మొదటిరోజుల్లోనే.

తన భార్యకాగానే, అధికారాన్ని పొందింది. తనమీద ఇష్టం నిజమే. ప్రేమ కూడాను. కాని అధికారిణి తాను. తన సౌకర్యాలన్నీ చాలా జాగ్రత్తగా చూసింది. కాని నౌకర్ల చేత చేయించేది. తాను చెయ్యవలసిన అవసరం లేదంది. నిజమైన ప్రేమవుంటే నౌకర్ల చేత చేయిస్తుందా? మరి నౌకర్లెందుకు? అదీ—ఎప్పుడూ పని ఆమెకి, మీటింగులు, ప్రయాణాలు, టీపార్టీలు, తను వృత్తిభర్త. అందువల్లనే భరించలేకపోయినాడు, పదేపదే సుశీలని తలుచుకున్నాడు. సుశీల మల్లె ఎన్నడూ ఏడవలేదు దుర్గ. ఎంత కోపంలోనూ, బాధలోనూ, తనే దిక్కువలేదు ఆమెకి. ఆమె గర్వం, ఆమె కన్న ఆమెకి ఎక్కువ దిక్కు ఎవరూకాదు. ఎన్నాళ్ళయినా అంత అందంగానే వుంది. కాని ఆ మొదటిరోజుల విద్యుల్లతలే లేవు. ఆమెని ఎంతదగ్గిరిగా పట్టుకున్నా, అతనికి ఏ సుఖమూ కలగదు. తమని ఇచ్చుకునే గుణంలేనివాళ్ళనించి పొందే అసంతృప్తి అది. పురుషుడి సౌఖ్యం కన్న, తమ సౌఖ్యంకన్న, మోహంకన్న, కలయికకన్న, తాము అధికులమనే గర్వం రాయి గట్టిస్తుంది స్త్రీని. ఈనాడైనా, ఇంత చవకైనా సుశీల సామీప్యమే ఉజ్వలం. ఎన్నడూ తనకి తాను జ్ఞాపకం ఉండదు, సుశీలకి. పురుషుడికి ఏదో వరాన్నో, అనుగ్రహాన్నో, ఇస్తున్నామన్న ధ్యాసేలేదు. తానిచ్చిందానికన్న: ఇతరులే తనకిచ్చారనే కృతజ్ఞత.

మర్నాడు పొద్దున్నే అతను వొచ్చి కూచున్నాడు, కలపవర్తకం అతనికి.

"ఇక్కడే వుండండి, ఏమనుకోకండి. ఎంతకాలమైనా వుండండి" అన్నాడు సుశీల ప్రియుడు. హృదయ పూర్వకంగానే అన్నట్టు వినపడ్డాయి మాటలు. అతనెందుకు తనని అంగీకరించాలి, ఆదరించాలి. అంతా సుశీల ప్రజ్ఞ, ఆమె హృదయ విశాలత్వం, ఏమిటో దుర్గ పూర్తిగా మనిషిగా వుండదు. చాలామంది ఆడవాళ్ళమల్లెనే, మోహంలో ఐనా, దుర్గ శరీరానికి ఇష్టమే. కాని మనసులో సంకుచితత్వం, గర్వం, వేరుతనం వుంది. తననించేకాదు. ఆ మనిషే అంత, నాలుగు రోజులయిం తరువాత సుశీల కొత్తగా కనపడ్డది ఓ ఉదయం, ఏమిటా అని చూస్తే చెవులకి

కమ్మలు తీసేసింది. తన ఇంటినించి వొచ్చేప్పుడు తనిచ్చిన సొమ్ములన్నీ జాగ్రత్తగా తనకి వొప్పచెప్పేసి వొచ్చింది. తనకి ఏడుపు వొచ్చి తీసికెళ్ళమనీ, ఇంకా డబ్బుకూడా ఇస్తాననీ అనాలనిపించింది! వెళ్ళ మనగానే వెళ్ళిపోతోందని కోపమూవుంది. ఇక్కడ వొంటిమీద ఏమీ వొస్తువులులేవు. అడివి అని భయమేమో? కాదు. అసలు అట్టే సమృద్ధిగా లేవు ఏవీ. డబ్బుకి తంటాలే గావును. మర్నాడు బిస్కట్లూ, ఓవల్టిన్, బ్రివిల్, డబ్బాలపళ్ళూ అన్నీ తెచ్చారు ఎవరో!

"ఎందుకివన్నీ?"

"మీ కోసమే!"

"నా కెందుకు?"

"మీకు బలంపట్టడంలేదు."

"చాలా ఖర్చయివుంటుంది."

"ఫరవాలేదు."

ఆ మాటలో ఎక్కువ ధైర్యంలేదు. చప్పన అనిపించింది. ఆ కమ్మలకీ, యీ సామానులకీ సంబంధంవుందా అని సుశీలకి నగలంటే చాలా ఇష్టం.

"నీ కమ్మలు కనబడవేం?"

"తీసేశాను."

"ఏమి?"

"బాగుచేయిద్దామని."

"నిజం చెప్పు."

తల వొంచుకుంది.

"మాట్లాడవా?"

"ఏంలేదు. ఈ ఏడు ఈ వర్తకం అట్టే లాభంగాలేదు."

మాట్లాడకుండా తను తెచ్చుకున్న మూడువేలు జేబులోంచి తీసి ఇచ్చేశాడు. తీసుకోలేదు. తీసుకోకపోతే వెంటనే వెళ్ళిపోతానన్నాడు.

ఎదురుగా చిలకలగుంపు ఎగురుతోంది, ఆ ఉదయం. రెండు జింకలు తొంగిచూస్తున్నాయి దూరంగా. వాటి మచ్చలమధ్య ఎండచారలు పడుతో.

వారం గడిచింది. కోడిగుడ్లతో, సూపులతో అతనికి తొరతొరగా బలంపడుతోంది. ఆ టైఫాయిడ్‌లో బతికాడతను. ఆ జరంలో తనవేపు రాక నౌకర్ల చేత చేయించినందుకేగా తనకి ఆ చివరికోపం వచ్చి, బయలు దేరి ఇక్కడికి ప్రయాణమయింది తను!

మెల్లిగా అడివిలోకి కొంచెందూరం అటూ ఇటూ షికారుకూడా పోతున్నాడు. వాళ్ళపాక, పనివాళ్ల గుడిశలే ఆ అడివికి ఇళ్ళు. చెట్లు చాలా కొట్టెయ్యడంవల్ల విశాలంగా వుంది. ఒకరోజు సుశీలకూడా వొచ్చింది అతనితో. కొంతదూరం వెళ్ళి నడవలేక వెనక్కి తిరిగాడు. కళ్ళచూపు అందనంత ఎత్తు చెట్లలో పడమటిఎండ పసుపుగా ఎర్రగా, చెట్టునించి చెట్టుకి కాంతి వరదలతో పూడ్చేస్తోంది. ఏదో ఓ మూలనించి ఇదివరకు వినని పక్షి అరుస్తోంది మధురంగా. వాళ్ళిద్దర్నీ పైనించి వెయ్యికళ్ళు, పక్కనించి ఏవో మృగాలు కనిపెడుతున్నట్లు వుంది. ఉడతలు, పక్షులు, కోతులు, "ఇట్లాపోదాం" అని పక్కగా వెళ్ళారు కొంతదూరం. అక్కడ సగం ఎండిన ఏరు, రెండుప్రక్కలా కస్తూరి తుమ్మచెట్లు, ఆ పచ్చనిపూల పరిమళం భరించడం కష్టంగా వుంది. అక్కడక్కడ ఏటిమీద శాఖలు కలుపుతున్నాయి చెట్లు: తేటనీరు, పక్కన మనిషి తొక్కని ఇసిక పరుపు. నీడలో కూచున్నారు అలిసి. వెల్లకిత్తలా పడుకున్నాడు అతను. కొమ్మల్లోంచి ఆకాశం చూస్తో, ఇంతకన్న ఏ కాంతి కావాలి మానవుడికి?

"ఎంత చిక్కిపోయినారో?" అంది మెడదగ్గర బైటపడ్డ వెమికల్ని

"దుర్గ మంచి అమ్మాయేనా?"

"ఊఁ."

"నాకుమల్లే కష్టపెట్టలేదు కద మిమ్మల్ని?"

"లేదు."

"మరి ఎందుకు వొచ్చేశారు?"

"నిన్ను మరిచిపోలేక."

"పొండి. అబద్ధం. ఏదో కారణం వుంది."

"ఆ కారణమంతా నిన్ను మరిచిపోలేక పోవడం వల్లనే.'

"మరిచిపోలేక ఏం లాభం?"

"అంతే."

ఆమె కంఠంలో కొంత భయంకూడా వుంది, ఆమెని మళ్ళీరమ్మని పిలుస్తాడనా?

ఉడతలు పరుగెత్తుతున్నాయి. ఎర్రటోపీల పిట్టలు నీళ్ళ కోసం వొచ్చాయి. దూరంగా కొంగ ధ్యానం చేస్తోంది.

ఆమె చేతిని తన అరిచేతులో పట్టుకుని ఆకాశంవంక చూసి ఆలోచిస్తున్నాడు. ఆమె కూడా మోచేతిమీద ఆనుకుని వొరిగి అతని కేసి చూస్తోంది. తన మొహాన్ని తిప్పి ఆమెకేసి చూశాడు.

"అంత జబ్బుతో బైలుదేరారు. చచ్చిపోదురు."

ఆమె కళ్ళలో తడి. గాలికి ఆమె జుట్టు అతని బుజంమీద ఎగురుతోంది.

"నాతో ఇట్లా వొస్తే ఏమీ అనడా?"

"ఏమో! నాకేం తెలుసు?"

"అంటే?"

"అననీండి."

అపుడు అంతే సుశీల. కొడతారు అంటే కొట్టనీండి అంటుంది. తనదగ్గిర ఉన్నప్పుడు తక్కిన వాళ్ళతో అట్లానే అని వుంటుంది. తను చాలా కఠినంగా కొట్టేవాడు. భరించలేక అవతల మనిషితో "కొట్టాడు" అనివుంటుంది. కొడతాడు అని వాళ్ళు జాలిపడితే, "కొడితేనేం, నీ కౌగిలి కన్నా?" అని వుంటుంది. ఏమయ్యేవాళ్ళో ఆ మొగవాళ్ళు ఆ మాటకి! ఇంక ఆమె రుణాన్ని ఎట్లా తీర్చుకోగలమా అన్నట్టు అయివుంటారు. ఆ మాటలు మాటలేకాదు. నిజం. ఆమెని కొట్టవలసి వచ్చే గతి తనకి పట్టడం, ఎంత కొట్టినా లాభంలేకపోవడం, ఆ రోజుల తన వేదన, ఆమెని తాను విడవలేనితనం జ్ఞాపకం వొచ్చి ఆమెవంక చూసేప్పటికి ఆమె తన కన్నీళ్ళని తుడుస్తోంది.

"ఏమిటి?"

"జ్ఞాపకాలు."

"నేనా?"

"నీ కోసమైన నా బాధ!"

ఆమె ఏడుపు ఆపుకోలేకపోయింది.

"ఛండాలురాల్ని, మిమ్మల్ని కాల్చేశాను," అని గుక్కలు మింగలేక ఏడ్చేసింది.

అతని చెయ్యి ఆమె మెడచుట్టూ! ఆమె తల అతని రొమ్ముమీద.

ఆమె జుట్టులో ఎండపడి అతని కళ్ళల్లోకి. మెల్లిగా ఆమెని పైకి తీసుకుంటున్నాడు. తన చేతులో ఇరిగిపోతున్నట్టు, వశ్యమయ్యే ఆమె నంతా. అతని అభిలాషని గ్రహించింది.

"వొద్దు."

చివుక్కుమంది అతని అహంభావం. కావలసిరావడం. కాచి ఆ చిన్న ఇబ్బందిని కూడా గ్రహించింది ఆమె.

"ఇంకా మీకు బలం పట్టలేదు."

అదే సుశీల. ఎప్పుడూ తను ఇష్టపడ్డవాళ్ళకోసమే, వాళ్ళ సంగతే, తను అని ఎక్కడా లేదు ఆమెకి.

వాళ్ళు బైలుదేరేప్పటికి చెట్లని వొదిలి పచ్చికనించి బారల బారలుగా శలవు తీసుకుంటున్నాడు సూర్యుడు. ఉడతలూ, పిట్టలూ వెళ్ళి పోతున్నాయి ఇళ్ళకి.

రాత్రి వొంటరిగా నక్షత్రాలవంక చూస్తో కొంచెం బాధపడ్డాడు ఆమె ఆ నిమషాన ఆ ప్రియుడి చేతుల్లో పడుకుని వుంటుందని. ఆ నిమషాన ఆమెని అతనేం చేస్తోవుంటాడోనని తలుచుకుని. సాయింత్రం అప్పటి తను జ్ఞాపకం వొస్తాడా ఆమెకి! కాని ఇప్పుడు ఎక్కువ బాధ రాలేదు. ఆమె అతనిదీ, అతని భార్య, తనకి ఎరువు. తను తీసుకుంటు న్నాడు ఆమెని. అనుకునేటప్పటికి శాంతి వొచ్చింది.

అన్ని చిత్రాలు మానవ హృదయంలో....ఆ నక్షత్రాల కన్న లోతు రహస్యాలు.

దుర్గని, తన ఆస్తిని, వూరిని, మిత్రుల్ని, వ్యాపారాన్ని అన్నిటినీ వొదిలిరావడం తాను; ఎట్లా వొచ్చాడు? తనకి తెలీకుండానే సుశీలపైన తనకెంత విశ్వాసమో, పరస్పరం అంత గాయాలు చేసుకున్న సుశీలమీద! ఎవరన్నా తెలిస్తే నవ్వరా! తనకి మతీ, నీతీ, వుందనుకుంటారా ? ముందు సంగతి? ఏమో! సుశీల ఎన్నడూ తనని అన్యాయం చెయ్యదు. వొంటరినీ కాని అంతటితో ఆగదు, ఎట్లానూ తప్పదు సుశీలని తాను తీసుకోడం. తెలిసి అతను ఆమెని తంతాడా? మళ్ళీ ఆమెకి మొదలా యాతన! వీల్లేదు. తను వెళ్ళిపోవడమే మంచిది. తనతో వొచ్చేస్తుందా పోనీ! ఏమో? వొచ్చి మళ్ళీ ప్రారంభిస్తుంది. తను సహించగలడా? మళ్ళీ తంతాడు. ఎందుకు వొచ్చినట్టు తను, సుశీలని సుఖంగా బతకనీక!

మొదటిసారి సుశీల తననించి వ్యభిచరించడం జ్ఞాపకం వొచ్చింది.

పుకార్లు విన్నాడు. ఆకాశరామన్న ఉత్తరాలూ వొచ్చాయి. కాని నమ్మలేదు తను.

ఓ వెన్నెలరాత్రి కళ్ళతో చూశాడు. వెర్రెక్కిపోయింది. ఆమె తిరిగి రావడంకోసం చూస్తున్నాడు.

"ఎక్కడికి వెళ్ళావు?"

"తోటలోకి. నిద్రరాక."

"నిజం చెప్పు."

అంతే తెలిసింది గావును ఆమెని తను చూసినట్టు. అంతే. ఒక్కమాటలేదు. కొట్టాడు. చచ్చేట్టు కొట్టాడు, మాట్టాడదు. పొమ్మన్నాడు. ఆ నిమషాన పొమ్మన్నాడు. పోలేదు. మంచం పక్కన కింద కూచుని అతని కాళ్ళు పట్టుకుని ఏడుస్తోంది. తన్నాడు. ఎక్కడ తగిలిందో, పడిపోయింది. లేవతీశాడు. షెడ పట్టుకు వేళ్ళాడింది. పైగా "పాపం—పాపం! పిచ్చి నాయనకి చాలా కోపం తెప్పించాను."

ఆ మాటలతో తనకి ఎంత వొళ్ళుమండిందో, ఏడుపు వొచ్చింది రోషంతో, తనని తలుచుకుని తనమీద, బాధమీద జాలివల్ల.

"ఏడవకు, ఏడవకు" అని తన తలని, తల్లిలాగు రొమ్ముకి అద్దుకుంది, అంతే. దాంతో అతనికి వొళ్ళు తెలీలేదు. ఆ రాత్రి మళ్ళీ మొదటిరాత్రికన్నా ఎక్కువ మాధుర్యాన్ని సుఖాన్ననుభవించాడు. తన కసీ, క్రోధం, బాధ అన్నీ ఏదో వింత ఆకర్షణగా మారిపొయినాయి. తనూ చాలా బలాఢ్యుడు—తలచుకుంటే ఇప్పుడు నవ్వు. మొదట తను, తరువాత అతనెవరో, మళ్ళీ తను — ఆ రాత్రే. తనదీ. తనదీ! తనది కాకండా ఎట్లా పోతుంది! రానీ వాణ్ణి. కాపలా కాశాడు ప్రతిరాత్రీ. రాలేదు వాడు. సమయం చూసి వెముకలు విరిగేట్టు తన్నించాడు వాణ్ణి వాడి పొలంలోనే. అప్పటికి శాంతించింది అతని కోపం.

కాని మళ్ళీ ఆర్నెల్లకే, తన కన్ను మరుగుకాగానే. ఇంకోడితో మళ్ళీ ప్రారంభం.

పుకార్లు, అప్రతిష్ఠ, సిగ్గు, తలెత్తుకోలేకపోవడం, వాతలు పెట్టాడు ఓ రాత్రి, మాట్లాడదు. అతని చెయ్యి కాలిందని విసిరింది రాత్రంతా మందుపూసి, ఎట్లా వొదలడం?

తనూ బలాఢ్యుడే. ఎందుకా గుణం!

బతిమాలి అడిగాడు. పొమ్మన్నాడు. పోదు.

ఆమెని తాకను పొమ్మన్నాడు. సరేనంది.

ఎందుకో ఆగుణం చెప్పమని బతిమాలాడు. చెప్పదు. తెలీదు గావును ఆమెకే.

ఆమెనించే ఆరాలుతీశాడు. సంగతులు, కార్యం కాకముందునుంచీ అంతేట ఆమనిషి, తరవాత ఇంకోరు.

ఎందర్ని తన్నిస్తాడు? చివరికి విధిలేక గెంటాడు ఇంటోంచి, పోకపోతే జుట్టుపట్టి ఓరాత్రి బైటకి ఈడ్చి తలుపువేశాడు. మనసు రాయి చేసుకుని వూరుకున్నాడు. ఏమయిందో తెలీదు. తరువాత ఈ ఉత్తరం వొచ్చిందాకా ఈ అడివినించి. అసలు తానెప్పుడూ సుశీలనే వాంచిస్తున్నాడేమో ననిపించింది. గతిలేక సుశీలను వెళ్ళగొట్టాడు గాని, సుశీల వెళ్ళిం తరువాత జీవితం అయోమయమైపోయింది. ఏ వస్తువ ఎక్కడవుందో తెలీదు. తనకి భోజనానికి ఏమి ఇష్టమొ మరిచిపోయినాడు. బట్టలు ఎన్ని తగాదాల్లోకూడా, తను ఎంత తన్నినప్పుడూ, ప్రియుడికోసం ఆమె తపిస్తున్నప్పుడుకూడా, తన సేవలో ఒక్కలోపం కలగనీలేదు. అందుకే ఏంతోచక వెళ్ళిపోయినాడు తను మద్రాసు.

దుర్గకి నౌకర్లు వృత్తచాకిరీచేసే మనుషులు, మొహం చిట్లించుకొని మాట్లాడదు వాళ్ళతో, ఆమె వికాసమల్లా ఇరుగు పొరుగు ధనవంతులు వొచ్చినప్పుడే. బట్టతో, మాటతో విలవ కడుతుంది మనుషుల్ని. తనని తాను వొదులుకొని, మరిచిపోయి ప్రవర్తించదు ఏ నిమషంకూడా, తన దేహాన్నికూడా చీరెని ఎరువిచ్చినట్టే ఇస్తుంది.

ఈ అడివిలో ఈ కూలీలందరికీ మిత్రురాలు సుశీల. కూలీల ఆడవాళ్ళ గుడిసెలముందు కూచుని, వాళ్ళకూరలా, బాధలా, పిల్లలా, అన్నీ తనే పంచుకుంటుంది. కలపరంపం చేస్తోవుంటే అక్కడ కూచుని పలకరిస్తుంది కూలీల్ని. నవ్విస్తుంది. మనిషినించి మనిషికి అప్యాయంగా ప్రవహించే సుహృద్భావంగావును అది. ఆ భావం ఎక్కువై ప్రియుల తాపం భరించలేక పోయిందేమోనని ఆమెకి Excuses ఎక్స్యూసెస్ వెతికాడు.

చాలా శాంతంగా హాయిగా గడిచిపోతోంది కాలం. ఆమె ప్రియుడు వర్తకానికి చాలా రోజులు వెళ్ళిపోతోవుంటాడు. ఓ రోజు వొచ్చి అడిగాడు. తను ఇచ్చిన మూడువేలలోంచీ వోవెయ్యి అప్పుగా వర్తకంలో ఉపయోగించ వొచ్చునా అని. మూడువేలూ తీసుకోమన్నాడు. కాలం: నున్నని నెమ్మదైన జలధారమల్లే మెరుస్తో వెడుతోంది. లెఖ్ఖలు చూసు కోడానికి ఏమీలేదు. క్రమంగా చలి తగ్గడం, కొత్తరకాల పిట్టలు రావడం, కొత్త రంగులతో, కొత్త ఈలలతో. కొన్ని మృగాలు ఎక్కువగా తొంగి చూడడం, చెట్ల ఆకులు ఎరుపుగా మారడం. ప్రతిసాయంత్రం ఉదయం అట్లా తిరిగివస్తాడు. సుశీలకి పని ఎక్కువగావుంది. తనతో రావటం లేదు. ఒక్కొక్కప్పుడు ఆ ఏటివొడ్డున ఇసికలో కూచుంటాడు. సుశీల తనతో అంతకాలం వుండకపోయినా, అంతసేపూ ఆమె చూపులు తన వెంట ఉన్నట్టే వుంటాయి. ఆమె హస్తాలు తనని సద్దుతో తనని కావి లించుకునే వుంటాయి.

ఒక మధ్యాన్నం యేటివొడ్డున అదే స్థలంలో కూచున్నాడు. వరసగా చాలా కొంగలు చేరాయి. ఆ తేటనీటిలో ఆడుకునే చిన్నచాపల్ని మింగేస్తున్నాయంటే దిగులేస్తుంది. పెద్ద ముక్కుల నీలంపక్షులు నీటిమీద బాణాలవలె దూసుకుంటో. పొదల్లో గుంపులు గుంపులు పూరపిచ్చికలు. తటాలున పరిగెత్తే కుందేళ్ళు. తొంగిచూసే దుప్పులు, నీళ్ళమీద ఎగిరి ఎగిరి పడే ఎండ. గాలికి నీళ్ళు కదిలినప్పుడల్లా, మెరుపుమార్పులు, ఏమిటో ఇదంతా ఈ ఆట, ఈ అందం ? ఎవరికోసమో ! ఎందుకోసమో ! అని ప్రశ్నలు అర్థాలు యోచించవలసిన అవసరం లేకండా ఆ గాలి

మల్లేనే మనసుమీదనించి చిన్నస్పర్శతో తేలిపోయే ఆలోచనలతో నిద్ర పోయినాడు. ఎండలో ముక్కలు మెరిసే కొంగలకేసి చూస్తో.

కళ్ల తెరిచేటప్పటికి ఎండలేదు. మృదువైన గాలి తన తెల్లని జుట్టుని, ఇదేమిటి ఇక్కడ? అన్నట్లు కదిలించి చూస్తోంది. సాయంత్రపు మెత్తని వెన్నవంటి కాంతి. తన పక్కన సుశీల తనకి తగులుతో పడు కుంది. నిద్రపోతో, చాలాసేపు చూశాడు. నవ్వే శాంతమైన ఆమె కను రెప్పల్ని, ఏం భయం, ఏం అశాంతి, ఆమెకి? ఏం లేదు. హాయి. తిట్లూ, దెబ్బలూ, బీదరికం, వేటిని చూసినా భయంలేని, వాటిని జీవితంలో మామూలు భాగంగా తీసుకునే ఆమెకి ఏం భయం? తను, తన అహం, తనబాధ, తన ఆత్మకి గాయం, తన గౌరవం, అనుకునే వాళ్ళకే భయాలూ బాధలూ.

ఆమె తనదీ, తనది కాదు— ఎట్లా చూసుకుంటే అట్లానే. ఆమె లోంచి ఏ విగించే వలలూ రావు. వేరు పరిచే తడికలూ వుండవు.

మెల్లిగా పక్కకి తిరిగి ఆమె చుట్టూ చెయ్యి వేశాడు.

నిద్రలోనే చిరునవ్వు. ఎవరనుకుందో? ఎవరనుకుంటేనేం ? తను అని తెలిసినప్పుడు వేరుతనం రాదు. ఆ కళ్ళలోకి. ఆ చల్లని గాలి ఆమె కుచ్చెళ్ళతో ఆడుకుంటోంది. మెల్లిగా, మెల్లిగా, ఆమెమీద తన అపారమైన ప్రేమని ఆపుకోలేక తన మోచేతినానుకుని బలువు తెలీనిక ఆమె రొమ్ము మీదికి వొంగాడు, ఆమె వూపిర్ని తన మొహం మీద అనుభవిస్తో, ఆమె యీ అడివిలో సహజమైన ఒక ప్రాణి అనిపించింది అతనికి.

మెల్లిగా కళ్ళు తెరిచి చూసింది. నవ్వింది దయగా, అరిచేతుల్ని ఆమె వీపుకిందికి ఇసిక లోకి పోనిచ్చి ఆమెని దగ్గరగా తీసుకుని, "నాకు బలం వొచ్చింది." అన్నాడు పెదవుల్లోకి.

ఆ రాత్రి నక్షత్రాల కాంతిలో, అప్పుడే వుదయించి చంద్రవంక

వెలుతురు పందిరి కిందికి పాకుతోంది! ఆమె యజమాని లేడు. సుశీల వొచ్చి తనపక్కన పడుకుంది!

"అతను ఏమంటాడు?"

"వూరికే ప్రశ్నలతో గోలపడకండి. ఏం జరిగితే అది జరుగుతుంది. అన్నీ నాకు వొదిలెయ్యండి."

"ఎందుకు ఊరుకుంటాడు? అతని మనిషివి."

"ఎన్నడో మొదటిరోజే చెప్పాను అతనితో. నేనెవరో కూడా తెలీదు అతనికి అనాడు. నా భర్త నన్ను కోరిననాడు నా భర్తదాన్నేనని. భయపడకూ, నా పాపవి నువ్వు, నిన్ను నేను వదలను !" అని అతన్ని దగ్గిరికి తీసుకుంది.

"ఎందుకు?"

"ఎందుకేమిటి ? నీ భార్యని కానా? ఏం జరిగినా అదెట్లా అబద్ధమౌతుంది?"

చంద్రుడు ఆశీర్వదించాడు. నక్షత్రాలు నమస్కరించాయి ఆ పతివ్రతకి.